# మధ్యంతర బడ్జెట్-2019 మోసపూరితమూ, అవాస్తవిక అంచనాలు

**కేంద్ర** ఆర్థికశాఖామంత్రి మధ్యంతర బడ్జెట్ అని చెప్తూనే పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టాడు. దీనికి రెండు ముఖ్య లక్షణాలున్నాయి. అవి (1)జిడిపిని దీనిలో అతిగా అంచనా వేశారు(2) జనాభా ప్రాతిపదికన రూపొందించిన ఆకర్షక పథకాలు. ఎన్నికలకు ముందస్తుగా ప్రవేశపెట్టిన ఈ బడ్జెట్‌లో ఓట్ల దృష్టితో ప్రవేశపెట్టిన పథకాల ఖర్చు షుమారుగా లక్షకోట్ల రూ॥లుగా వుంది. అయినప్పటికీ ద్రవ్య లోటులో మార్పు ఏమీ చూపలేదు.

'ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి' పేరిట 75,000 కోట్ల రూ॥ సాంవత్సరిక వ్యయ అంచనాతో ఆర్థికశాఖామంత్రి ఒక కొత్త కార్యక్రమాన్ని ఈ బడ్జెట్‌లో ప్రకటించాడు. ఈ పథకం క్రింద 5 ఎకరాలవరకు సాగుభూమి కలిగివున్న వ్యవసాయదారులందరికీ సం॥నికి 6 వేల రూ॥ల ఆర్థిక తోడ్పాటునందిస్తామని పేర్కొన్నారు.

2015-16 వ్యవసాయ గణాంకాల ప్రకారం, మనదేశంలో సాగులోనున్న 14 కోట్ల 60 లక్షల సాగు కమతాలలో, 86 శాతం కమతాలు ఐదు ఎకరాలలోపు విస్తీర్ణం వున్నవే. 12 కోట్ల 50 లక్షలమంది సాగుదార్లు ఈ భూమిని సాగుచేస్తున్నారు. ఈ కుటుంబాలలో సగానికి పైగా ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, రాజస్థాన్ రాష్ట్రాలలోనే నివశిస్తున్నారు. భూమిలేని రైతుల సంఖ్య పెరిగిపోతుండటం, వ్యవసాయ ఉత్పాదకాల ధరలను పెంచి బహుళజాతి కంపెనీలు రైతులను కొల్లగొట్టటం, పండించిన పంటలకు బడావ్యవసాయ వాణిజ్య సంస్థలు మద్దతు ధరలు కూడా చెల్లించకపోవటం, రైతులకు సంస్థాగత రుణాలు అందకపోవటం వంటివి వ్యవసాయరంగంలో సంక్షోభం పెరగటానికి, రైతాంగపు పేదరికం పెరిగిపోవటానికి కారణాలుగా వున్నాయి. బిజెపి తన పాలనా కాలంలో వీనిలో ఏ ఒక్క సమస్యను కూడా పరిష్కరించటానికి పూనుకోలేదు.

'వ్యవసాయ ఖర్చుల, ధరల కమిషన్' (సిఏసిపి) అంచనా ప్రకారం, వరి, గోధుమ పంటల సాగుకు కౌలుఖర్చును, వ్యవసాయంలో వినియోగించే యంత్రాలకు చెల్లించే అద్దెలను మినహాయించినప్పటికీ హెక్టారుకు 70,000 రూ॥ఖర్చు అవుతోంది. అంటే రెండు హెక్టార్లకు 1,40,000 రూ॥ అవుతుంది. దీనిలో రెండో పంట వేసి పొందగలిగే ఉపశమనం ఏపాటి? కనుక, రైతాంగ మౌలిక సమస్యలను పరిష్కరించ కుండా సంవత్సరానికి రైతుకు రూ.6 వేలు ఇవ్వటం బిచ్చగాళ్ళకు ముష్టివేసినట్లు కాదా?!

మరోవైపున, ఈ అందజేసే కనీసపాటి పైకం కూడా భూమిపై వాస్తవికంగా సాగుచేస్తున్న సాగుదారునికి చేరబోవటంలేదు. వ్యవసాయ గణాంకాలు తెలుపుతున్న విధంగా భూమిహీనుల సంఖ్య పెరిగిపోతూ, ఐదు ఎకరాలలోపుగా వున్న భూకమతాల సగటు విస్తీర్ణం కూడా పడిపోతోంది. వ్యవసాయేతర రంగాలలో నిరుద్యోగం కారణంగా చిన్న, పేద రైతాంగం తమ జీవనోపాధి కోసం భూమిని కౌలుకు తీసుకుంటున్నారు. మొత్తం రైతాంగంలో 55 శాతం భూమిలేని రైతులుగాను, కౌలురైతులుగాను లేదా వేతన శ్రామికులుగానూ పనిచేస్తున్నారు. మరికొన్ని అంచనాల ప్రకారం, అఖిలభారత స్థాయిలో సాగుకు యోగ్యమైన భూమి మొత్తంలో 50 శాతం పైగా వ్యవసాయాన్ని కౌలురైతులే సాగిస్తున్నారు. నమోదు చేయించుకోకుండా కౌలుకు వ్యవసాయం చేస్తున్న వారి సంఖ్య ఇటీవలి కాలంలో మరింత పెరిగింది. ఈ విభాగపు రైతాంగానికి తోడ్పాటునందించటానికి బదులుగా కార్పొరేట్ వ్యవసాయానికి వీలుగా బిజెపి ప్రభుత్వం కౌలురక్షణ చట్టాలను రద్దుచేసే ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం కూడా, కౌలురైతులను మినహాయించింది.

ఈ పథకం క్రింద చెల్లింపులకు తగినన్ని నిధులు లేవనే చర్చ ఒకవైపుండగా, దీని ఫలితంగా దీర్ఘకాల ఆర్థిక, రాజకీయ సమస్యలున్నాయి. ఈ ఎన్నికల అనంతరం ఏ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ, ఈ పథకం నుండి వెనుకకు మరలలేదు. దీనికి ఈ పథకంయొక్క ప్రజాకర్షక స్వభావం మాత్రమే కారణంకాక, విధానపర చట్రంలో కూడా భాగం కావటం కారణం. సార్వత్రిక మౌలిక ఆదాయం(యుబిఐ) గురించిన చర్చ సాగుతోంది. అయినప్పటికీ, గ్యాస్ సిలిండర్ల సరఫరాలో లాగా, రైతులకు రుణమాఫీలో లాగా లబ్ధిదారునికి ప్రత్యక్ష నగదు బదిలీవంటి కుటిల పద్ధతుల్లో ఇది అమలవుతూవుంది. సర్వజన కనీస ఆదాయం(యుబిఐ) అమలులో భాగంగా రైతుకు రూ. 6 వేలు తోడ్పాటునివ్వటంతో, వ్యవసాయానికి ప్రభుత్వం ఇచ్చే తోడ్పాటు, సబ్సిడీ లన్నింటినీ ఎగవేయటం జరుగుతుంది. ఇది, ఆర్థిక మీటలతో రైతులను వారి భూములనుండి దూరంచేయటంతో సమానమే అవుతుంది.

మధ్యంతర బడ్జెట్‌లో భాగంగా, 'ప్రధానమంత్రి శ్రమ యోగి మంధాన్' పథకాన్ని ప్రకటించి, దానికింద అసంఘటిత రంగంలోని కార్మికులకు తక్షణం 500 కోట్ల రూ॥ను కేటాయించారు. ఈ పెన్షను పథకం రూ.15000 లోపు నెలవారీ ఆదాయమున్న కార్మికులకు మాత్రమే వర్తిస్తుంది. అసంఘటిత రంగంలోని మొత్తం కార్మికులలో సుమారు నాల్గవ వంతు కార్మికులు మాత్రమే ఈ పథకం పరిధిలోకి వస్తారు.

"29 సం॥లకు పనిలో చేరిన కార్మికుడు, ప్రతినెలా తన వంతుగా వంద రూ॥ చొప్పున 60 సం॥ల వయస్సు వచ్చే వరకు చెల్లిస్తే, ప్రభుత్వం కూడా నెలనెలా అంతే మొత్తం జమచేస్తూ వుంటుంది. 60 సం॥ల వయసు తర్వాతనుండి ఆ కార్మికుడు నెలకు 3000 రూ॥ పెన్షను పొందుతాడు" అని ఆర్థికమంత్రి ప్రకటించాడు.

అసంఘటిత రంగంలోని కార్మికుల ప్రయోజనం కోసం గతంలో ప్రకటించిన 'భవన నిర్మాణ కార్మికుల బీమా'వంటి పథకాలున్నాయి. భవన నిర్మాణ కార్మికులకు కార్డులు జారీచేయటం వరకు ఈ పథకాలు పరిమితంకాగా, ఈ పథకం గురించి అత్యధికులైన భవన నిర్మాణ కార్మికులకు తెలియనే తెలియదు. భవన నిర్మాణ కార్మికులు ప్రతిరోజూ అనేకమంది తమ పనిప్రదేశాల్లో జరిగే ప్రమాదాల్లో ప్రాణాలొదులుతూ వుండగా, కార్మికుల నుండి బీమా ప్రీమియమ్‌గా వసూలు చేసిన కోట్లాది రూపాయల నిధి నిరుపయోగంగా పడి వుండటాన్ని మనం చూస్తున్నాం.

అసంఘటితరంగంలో ఉద్యోగాలు స్థిరంగా వుంటాయని ఎవరూ చెప్పలేని స్థితి అందరకూ తెలిసిందే. కనుక, కార్మికులు, ఉద్యోగులు 30, 40 సం॥ల తర్వాత పెన్షను ప్రయోజనం పొందటానికి వీలుగా ప్రతినెలా కొంత మొత్తాన్ని జమచేయగలిగే స్థితిలో వుంటారని గ్యారంటీలేదు.

అసంఘటితరంగంలోని కార్మికుల దయనీయ స్థితిని గుర్తించటానికి, దానిని నివారిస్తామని వాగ్దానం చేయటానికి పాలకవర్గ పార్టీలకు ఏడు దశాబ్దాల కాలం పట్టింది. ప్రతిపక్ష పార్టీలు నిరుద్యోగ సమస్యను తమ ఎన్నికల ప్రచార అస్త్రంగా చేసుకోవటంతో, పెన్షను పథకం రూపంలో బిజెపి వారిని దీటైన రాజకీయ దెబ్బ కొట్టేందుకు ముందుకొచ్చింది.

"రానున్న 5 సం॥ల కాలంలో ప్రపంచంలోనే అతిపెద్ద పెన్షను పథకాలలో ఇది ఒకటిగా వుంటుంద"ని ఆర్థికమంత్రి ప్రకటిస్తూనే, అతికొద్ది బడ్జెట్ మత్రమే కేటాయించిన ఈ పథకం, కేవలం ఎన్నికల ఎత్తుగడ మాత్రమే.

మధ్యతరగతి వర్గానికి 5 లక్షల ఆదాయం వరకు పన్ను మినహాయింపునివ్వటం ద్వారా ఎన్నికల ఉద్దేశిత బడ్జెట్ వారిని ఆకర్షించే ప్రయత్నం చేసింది. అలాగే సాధారణ, మధ్యతరగతి ఇళ్ళ అమ్మకాలను ప్రోత్సహిస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు పన్ను మినహాయింపులనిచ్చింది. 2014 నాటి బిజెపి ఎన్నికల ప్రణాళికలో పై రెండు చర్యల గురించి వాగ్దానం చేశారు కానీ ఇప్పటివరకు అమలుకు పూనుకోకుండా, ఎన్నికల ముంగిట వాటిని ప్రకటించారు.

ద్రవ్యలోటు 3.4 శాతం వుండగా, లక్షకోట్ల రూపాయలు ఈ పథకాలకు కేటాయిస్తామనే ప్రకటన హాస్యాస్పదమైనది. జిడిపి పెరుగుదల అవాస్తవికంగా 11.5 శాతంగా పేర్కొన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల నుండి, భారత రిజర్వు బ్యాంకు నుండి మరిన్ని డివిడెండ్లను రాబట్టే పన్నాగాలు, ఇప్పటికే వత్తిడిలో కూరుకుపోయిన ప్రభుత్వరంగ బ్యాంకులపై మరింత వత్తిడిని పెంచుతాయి.

ఆదాయం విషయం పరిశీలిస్తే, జిఎస్‌టి వసూళ్ళలో సవరించిన అంచనాల ప్రకారం లక్షకోట్ల రూ॥ల తగ్గుదల కన్పిస్తోంది. ఉత్పాదక రంగాన్ని పునరుద్ధరించటానికి స్పష్టమైన విధానామేమీ లేకపోయిన కారణంగా, ఈ సం॥ కూడా జిఎస్‌టి వసూళ్ళ అంచనా వేసిన విధంగా పెరగబోవటంలేదు. రాష్ట్రాలకు అందించాల్సిన గ్రాంటులు, రుణాలను 29 వేల కోట్ల రూ॥ల వరకు కేంద్రప్రభుత్వం పంపిణీ చేయకుండా మిగుల్చుకుంది. ప్రస్తుత సం॥లో అది సాధ్యం కాకపోవచ్చు. ద్రవ్యలోటు అదుపులేని విధంగా పెరగవచ్చు. రానున్న ప్రభుత్వం ద్రవ్యోల్బణ చర్యలను చేబట్టక తప్పదు.

ఎన్నికల ముందస్తుగా మోడీ మధ్యంతర బడ్జెట్ పేరుతో ప్రవేశపెట్టిన ఈ పూర్తిస్థాయి బడ్జెట్ మోసపూరితమైనదీ, అవాస్తవిక అంచనాలతో కూడుకున్నదీ కూడా.

ooooo